జాతశ్రీ

జీబ్రా

గంట కొట్టడానికి యింకా అరగంట పైముంది.

పాఠశాల తోటమాలిగా ప్రభుత్వంనుండి జీతం పుచ్చుకొంటూ హెడ్మాష్టరింటో పనిచేసే ఏశావు, ఆనాడు తోటలో గడ్డి పీకుతున్నాడు.

వరండాలో నిలుచున్న చప్రాసి – ఓదేలు, బీడీ త్రాగుతూ తుమ్మెదల్లా విహరిస్తున్న విద్యార్థులకేసి చూస్తున్నాడు. విద్యార్థులు కనిపించని క్షణాల్లో అతని చూపు అంతరంగంకేసి మరలుతుంది. ఆ క్షణాలు-దుర్లభాలు, కన్నీటి వలయాలు. ఇరవయ్యేళ్ళుగా సాగిన జీవితంలో ఏ రంగూ, రుచీ లేకపోగా, ముందున్న జీవితం కూడా–అలానే–శూన్యంలా కన్పిస్తుంటే, యింతకాలం గంటను కొట్టిన దెబ్బలు–తన గుండెల్లో మార్మోగుతున్నట్టుగా వణుకుతాడు. ''ఛీ...ఛీ...యీ ఉద్యోగం కాకుండా రోడ్డెంట పళ్ళీలమ్ముకొన్నా బాగుపడేవాణ్ణి'' వణుకుతోపాటు మనసున బుడగేసే తలంపది.

హెడ్మాష్టరింకా రాలేదు.

హెడ్మాస్టర్ గదికి కుడిగా, నలుగురూ నడిచే బాట కెదురుగా నాలుగు బారల పొడవూ, అంతే వెడల్పూ వున్నగది-స్టాఫ్ రూం. అది కట్టిననాడు తరగతి గది. ఆ తర్వాత లైబ్రరీ, ఆఫీస్, రికార్డ్ గదిగా దశలుమారి ప్రస్తుతం స్టాఫ్ రూంగా వుంది. అదే గది విశాఖ ఉక్కు, తెలంగాణా ఉద్యమాల ఉధృతంలో సి. ఆర్. పి. క్యాంప్‌గానూ, కొన్నిసార్లు ఎన్నికల పోలింగ్ బూత్‌గానూ ఉపయోగపడింది.

ప్రస్తుత మా గది పతనావస్థకేసి 'పయొనీర్'లా పరిగెడుతుంది.

గది మధ్యలో–ఓ కాలుకు ఋణం తీరిన ముసలిబల్ల, బెంచీ ఆసరాతో తన ఉనికిని కాపాడుకుంటూంది. బల్లచుట్టూతా కదిలితే కరిచే కుర్చీలు మూడూ, కదిలిస్తే విడిభాగాలైపోయే రెండుబెంచీలు వున్నాయి.

తూరుపుగా-బేల్ చెక్కల బీరువానిండా కట్టలుగా పేర్చివున్న నోట్సులు-యూనిట్ పరీక్షలవీ, యింటిపనివీ..., ఆ ప్రక్కనే 'స్టాక్ రిజిష్టర్'లోంచి తొలిగించబడని, ఉపయోగానికి పనికిరానివి– మేప్ స్టాండ్, ఆటసామాను, చెదలుతిన్న రికార్డు, మధ్యాహ్న భోజన పాత్రలూ, డ్రామా కర్టన్లూ కలగా పులగంగా వున్నాయి.

ఉత్తరంగా కిటికీ–అత్యవసరంలో ద్వారంలా కన్పిస్తూంది. పయిగా రెప్పవేయకుండా చూస్తున్న నెహ్రూ, రాధాక్రిష్ణ, ఇందిరా గాంధీ, వెంగళరావు వగయిరా నాయకులు-ఫ్రేముల్లో బిగించబడి వున్నారు. మొదటిద్దరికీ రంగువెలిసిన చమ్కీదండలు ప్రత్యేకం. ఒక్క వెంగళరావు తప్ప, మిగతావారు ఈస్ట్‌మన్ కలర్‌లో వున్నారు. నెహ్రూజీకి కుడిగా వుండే గాంధీజీ పోయిన స్వాతంత్ర్య దివోత్సవంలో పూజా పునస్కారాలందుకొని, పతాకోత్సవంలో గౌరవ వందన స్వీకారం అందుకొనేందుకు గోడదిగి, మళ్ళీ ఎక్కడానికి వోపిక లేదన్నట్టు, మేప్ స్టాండున పూలదండతో ఉరేయబడిన మానవతలా వున్నారు. ఫొటో నిండా కుంకుమబొట్లూ, అగర్‌బత్తి కావురూ-గాంధీజీరూపం–అస్పష్టంగా వుంది.

బల్లచుట్టూవున్న ఆసనాలపై ఆరుగురు మాష్టర్లు కూచున్నారు· వారిలో ముగ్గురు పరువంలో వున్నారు. యిద్దరిలో లేత ముదిమి ఛాయలు వున్నాయి. ఒకతను నడివయసు నిఘంటువు నెమరేస్తున్నాడు. వారి సగటు వయసు ముప్పయి నాలుగు.

వారిలో ఒకరి వ్రేలికి అరతులం బంగారం వుంది. ఒకరి చెప్పులు పదవీ విరమణస్థాయిలో వున్నాయి. ఒకరి నూలు చొక్కాకు అతని శ్రీమతి కుట్టిన కుట్లున్నాయి. ఒకతని టెరీన్ షర్టు జేబులో పదిరూపాయలనోటు కనబడుతూంది. ఒకతను బర్కిలీ వెలిగిస్తే, ఆ వెలుగుతో బీడీ వెలిగించేడు మరొకడు. వారి నెలసరి సగటు ఆదాయం ఐదొందల పదీ చిల్లర.

బల్లమీద దినపత్రిక వుంది. మొదటి పేజీలో 'ఉడుకుతున్న దేశం' కార్టూనుంది. మంట రాజేస్తున్నవారిలో ఒకరికి కోతితోక, ఒకరికి రాబందు ముక్కూ, మరొకరికి కుక్కమూతి, మిగిలినతనికి తోడేలు తలవుంది. అందరి నెత్తినా జెండాలున్నాయి. వాటిమీద చిహ్నాలున్నాయి. ఆ చిహ్నాలు బాలెట్ పేపర్‌ద్వారా జాతికి పరిచయమౌతున్నవే!

పత్రిక చూస్తున్నతను–రామ్మూర్తి. అతనికి పెళ్ళాం లేకపోయినా బ్రతగ్గలడు గాని, పేపర్ లేకుంటే బ్రతకలేడు. సుస్థిరమైన రాజకీయాలకంటే రంగులరాట్నపు రాజకీయాలంటే ఉత్సాహం చూపే గాలివాటం మనిషి.

అతనంటే పరువంలో వున్నవాళ్ళకు పరిహాసంగానేకాదు, అసహ్యంగానూ ఉంటుంది. 'యీ పార్టీలూ, పదవుల పోరాటాలూ దేశాన్ని సుసంపన్నం చేయవనీ, అన్ని విలువల్నీ ధ్వంసంచేసి, కొత్త

వ్యవస్థను ఆవిష్కరించా'లని వీరి వాదం. ఆ వాదానికి ప్రతివాదం చేసినవాళ్లను 'ఏడ్దేవా'గా చూస్తారే తప్ప, వివరణ యివ్వరు. క్రికెట్ కామెంటరీ వినడంలోనూ, అమితాబచన్ యాక్షన్ చూడడంలో అభిరుచి వున్నవాళ్లు—జీవన్, యాదగిరి, సుబ్బారావు.

మిగిలినిద్దరూ—కామేశం, నాయుడు; యిద్దర్నీ టీచర్లనడం కంటే టీచర్స్ యూనియన్ కార్యకర్తలనడం—సబబు. నాయుడు జిల్లాశాఖ యూనియన్ కార్యదర్శి, కామేశం మరో యూనియన్‌కి ఎక్సఫిషియో మెంబర్. ఎప్పుడూ ట్రాన్స్‌ఫర్లూ, యింక్రిమెంట్లూ, జి. వో.లూ, యూనియన్ గొడవలూ... వారికి వృత్తిపరంగా విద్యార్థులూ, జీవితంపరంగా భార్యలూ—చిట్టచివరిఅంశాలు.

"ఆఁ! . అరె! కొట్టేడు ఛాన్సు." పేపరు చూస్తున్న రామ్మూర్తి టక్కునన్నాడు.

అంతా ఉలికిపడుతూ, చూపుల్ని రామ్మూర్తికేసి నడిపేరు. ఆ చూపులు కొడవలి రూపంలో వున్నాయి.

రామ్మూర్తి అహం ఓ మెట్టెక్కింది. "అందుకేనోయ్, నే చెప్తా...ప్రపంచ పోకడకు దర్పణం—పత్రిక. యీనాటి వార్తను చదవనివాడు నిన్నటి చరిత్రను నమ్మగలడా? . నమ్మకం లేనివాడు పాఠం చెప్పగలడా? విద్యాస్థాయి పడిపోతుందంటే పోదూ మరి?... పాఠాన్ని ప్రపంచపోకడ కన్వయించి చెప్పని పంతులూ వో పంతులేనా?..." వాదనకి రండని, ఆహ్వానించే రీతిలో సర్దుకొంటూ అన్నాడు.

"అవ్‌నవ్‌ను ... యీమధ్య మా యం. యల్. సి. గారు స్టేట్మెంటిచ్చారు కూడా విద్యారంగంలో యీ మార్పుకోసం, జనువరిలో రాష్ట్రస్థాయి సదస్సూ, ఫెబ్రువరినుంచి అంచెలవారీ ఉద్యమం చేపడుతుంది మా యూనియన్." కామేశం.

"యీ సదస్సుల్తో, అవకాశవాద వుద్యమాల్తో, విద్యారంగం చచ్చినా బాగుపడదు. అసలు మన 'సెటప్'లోనే లోపం వుంది. యీ సెటప్‌లో విద్యకాదు, మరే రంగమైనా మాటల్లోతప్ప చేతల్లో ముందుకుపోదు. అందుకని..." యాదగిరి అంటుంటే,

కామేశం బనాయింపు ధోరణిలో—"ఔ... సెక్రటరీ పదవిపోతే యూనియన్ని చీల్చిన ఘనులున్న రంగంలో గురుడు చెప్పింది కరక్టే. " అని, 'దెబ్బకొట్టేను' అనుకొన్నాడు.

'కొట్టేడ్రా దెబ్బ' అనుకొన్న యాదగిరి, మారుదెబ్బకోసం వెతికేడు గాని, మంచి ధరగల మాటలు దొరకలేదు.

రంగం — రణరంగపు రూపెత్తేలా వుందనుకొంటూ, రామ్మూర్తి—"అసలు ఛాన్సు కొట్టినవాడ్ని అడుగునేశారు. మన బుచ్చెయ్యలేడూ? . ఏదీ ... మూడేళ్లకింద యీస్కూల్లో పిల్లలచే దెబ్బలు తిన్న బుసికళ్ల బుచ్చెయ్యకి—'బెస్ట్ టీచర్ అవార్డ్' వచ్చింది" అన్నాడు.

"ఆఁ!"—అంతా

ఒక టీచర్‌కి 'అవార్డ్' వచ్చినందుకు కాదు ఆ 'ఆఁ!'... బుచ్చెయ్యకు వచ్చినందుకు.

బుచ్చెయ్య హయ్యర్‌గ్రేడ్ టీచర్. యూనియన్ కార్యకర్త కాడు. ఆఫీసుల్లో పలుకుబడి లేదు. పాఠాలు తప్ప మరో ప్రపంచం తెలీని వ్యక్తి. అటువంటి అనామకునికి 'అవార్డ్' యివ్వడం, తమందరికీ అవమానంగా తోచి ఆ—'ఆఁ...'

"అతనిలో ఏ మెరిట్ చూసిచ్చారండీ?"

"ఏ 'మెరిట్' లేకపోవడమే 'మెరిట్'!" జోకేసేననుకొన్నాడు సుబ్రావు.

"గ్రాడ్యుయేట్ నొదిలేసి, హయ్యర్‌గ్రేడ్ కివ్వడమేమిటండీ?" అన్నాడు జీవన్. అతను సెకండరీ గ్రేడ్‌గా ఉద్యోగంలో చేరి, ప్రయివేటుగా బి. ఏ. రాసి, అత్తెసరు మార్కులతో పాసయ్యేడు. బి. ఏ. చదవని పంతుళ్లంతా మొద్దులని అతని మొద్దు నమ్మకం. పేరు చివరన బి. ఏ. అని రాయడం అతనెన్నడూ మర్చిపోడు. పోస్ట్ కార్డుమీదనైనా సరే!

"ఈసారి 'కో ఆర్డినేషన్' మీటింగ్‌లో యీ అవార్డ్సమీద దుమారం లేపుతాం చూడండి." నాయుడు.

"నా రీ—ఫిక్సేషన్ సంగతి మర్చిపోకు గురూ..." రామ్మూర్తి.

'యూ—సిల్లీ, ఒక టీచర్‌కి అవార్డొచ్చినందుకు దుమారం అంటున్నారు గని, ట్వంటీ పర్సంట్ లేనిదే 'బిల్' పాస్‌చేయని యల్. యఫ్. ఆఫీసర్‌మీద దుమారం లేపరేం?"

రోగ్ . వాడ్ని కాల్చి పారేసినా పాపంలేదు. టీచర్ల సొమ్ము తిని, రోడ్ రోలర్‌లా బొర్ర పెంచేడు. వి షుడ్ నాట్ లీవ్ సచ్ స్టుపిడ్స్" సుబ్బారావు 'జోక్'లా అనలేదు, క్రాక్‌గా అరిచేడు.

"సుబ్రావ్... మనం అరవడం తప్ప, యూనియన్ కివి వట్టవండీ...మీకు తెలీదుగాని, ఆ ట్వంటీలో — ట్వంటీఫయివ్ పర్సంట్ వీళ్లకి ముడుతుంది." కామేశం.

"వెనకటి కెవడో—'గాలిని మూటగట్టేను, అంటే—నానెత్తికెత్తు, మోసుకెల్తాను' అన్నాడట నీలాటివాడు. ఏదైనా బుజువు చూపి మాట్లాడితే మంచిది. స్పైగా మేధావులం" నాయుడు కాస్త సీరియస్‌గా అన్నాడు.

గాలి—సుడి తిరిగేలా వుందని గ్రహించిన రామ్మూర్తి, తన గోదావరీ పుష్కర స్నానానుభవాన్ని చెపుదామని నోరు తెరుస్తుంటే, సుడిగాలిలా దూసుకొచ్చేడు చెలం. పూర్తిపేరు జోగుల వీరగోపాల వెంకటాచెలం. రిజిష్టర్‌లో జి. వి. జి. వెంకటాచలం అని వుంటుంది. వస్తూనే "యిది విన్నారా?" అన్నాడు.

కేంద్రప్రభుత్వంలో 'నందా'గారిలా చెలం— ఆ స్కూల్లో—రెండుసార్లు యిన్చార్జిగా వున్నాడు. ఆ కాలమే స్వర్ణయుగమనీ, తనను మించి స్కూల్‌ని క్రమశిక్షణతో నడిపిన నాధుడు లేడని బాహాటంగా బాధపడ్తాడు.

అతను పుట్టిందీ, పెరిగిందీ, చదివిందీ ఆ వూళ్లోనే. ఆమధ్య విడుదలైన జి. ఓ. ప్రకారం ట్రాన్స్‌ఫర్ అయితే 'లీవ్' పెట్టేడేతప్ప ఊరొదల్లేదు. కాస్త వ్యవసాయం, యింకాస్త గ్రామ పెత్తందారీతనం వదులుకొని, కేవలం టీచర్‌గా బతకడానికి నేనేం బతకలేనోడ్నిగ ను అనేదతనివాదం

''విన్పించే గురుడొచ్చిందిప్పడేగా?'' నవ్వేడు సుబ్రావ్.

''ఏవిటి?'' రామ్మూర్తి.

''స్టూడెంట్స్ స్కాలర్‌షిప్స్‌లో ఫిఫ్టీపర్సంట్ కొట్టేడట హెడ్మాష్టర్'' అన్నాడు చెలం చిన్నగా.

పెద్దగా నవ్వేస్తూ యాదగిరి, ''ఓష్... దొంగలుబడ్డ ఆర్నెల్ల సావేతగా – కొట్టేయడం, ఆ డబ్బుతో అల్లుడికో స్కూటర్ కొనేయడం కూడా జరిగింది'' అన్నాడు.

''స్పెషల్ ఫండ్‌లో- దొంగ రిసీట్ లెన్నో, 'కాంటిన్‌జెన్సీ'లో కమీషనెంతో నన్నడగండి.'' నాయుడు.

''అడ్మిషన్స్'లో అందుకొన్న 'డొనేషన్స్' ఎన్నివేలో నన్నడగండి.'' సుబ్బారావు.

''అడగరెందుకు మరి?''

''ఆడిట్ వస్తే జవాబు చెప్పేదతను. మధ్య మన కెందుకు?...'' రామ్మూర్తి.

''బెల్ అండ్ బిల్ మనుషులం.'' సుబ్బారావు.

''ఇగో...యీ ఉదాసీనతే దేశాన్ని సర్వనాశనం చేస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడూ ఒక ఆడిటరే! అడిగే హక్కు మన కుంది.'' చెలం.

''మనమెందుకోయ్?... స్టూడెంట్ యూనియన్‌ని ఉసిగొలిపితే సరి.'' కామేశం.

పోనివ్వండి... అధికారం ఆయన చేతుల్లోవుంది. 'లెసన్ ప్లాన్స్' దగ్గరో, 'సూపర్విజన్' మిషతోనో, సి. యల్. దగ్గరో- నొక్కేస్తాడు. జీవన్.

''నొక్కేస్తాడేం? యీ బడేవన్నా వాడబ్బగాడిదా? మనవేం వన్నా వాడి నౌకర్లవా?'' చాలా ఆవేశంగా చెలం.

''పోయినేడు నర్సింహం గతేమయింది.''

''చలవా...మనం ఎంత నిజాయితీతోవున్నా, పై అధికారి, మరో అధికారికే సపోర్టిస్తాడు తప్ప, సబార్డినేట్ నెవడూ లెక్క చెయ్యడు.''

''అసలు నన్నడిగితే... ఈ దేశంలో అన్ని విలువల్నీ ధ్వంసం చేయకముందు, దేశంలోంచి 'పదవి' అన్న పదాన్ని తరిమేయాలి. ఏ చిన్న పదవిలోవున్నా—వెధవ అదోరకం పోజు పెడ్తారు.'' జీవన్.

''హెడ్, అంటే ఏవిటండీ? మిగతా అంగాల్లేనప్పుడు హెడ్ ఎక్కడుంటుంది?'' అన్నాడు రామ్మూర్తి నవ్వేస్తూ.

''మనెడ్మాష్టర్ యింగ్లీష్ చెప్తుంటే వినాలి... ఆ ఉచ్ఛారణ పాడుగానూ...బట్లరింగ్లీషు నయం.''—సుబ్బారావు.

''వాడికి చదువు చెప్పడం వచ్చి ఏడిస్తేగా, ఏ జి. వో. ప్రకారం-ఏ టీచర్ని ఎలా ఏడ్పించాలని ఆలోచిస్తాడే తప్ప...'' చెలం.

''యిటువంటి ఆఫ్ నాలెడ్జ్‌డ్ గాళ్లుండబట్టే మన సిస్టమ్స్ అన్నీ స్పాయిలై పోతున్నాయి. రోగ్... ఎందుకులే బతకనీ అనుకొంటుంటే...''

''ఐదు నిముషాలు లేటొస్తే – లేట్‌మార్క్! వాడు టైమింగ్స్ చూట్టానికి పనికొస్తాడుతప్ప, టీచింగ్‌కి పనికిరాడు.''

''యిటువంటి వెధవల్ని వందరూపాయలు ఖర్చుపెట్టి తన్నించినా పాపం లేదు.''

''చూస్తా కలెక్టర్‌తో ఎంక్వయిరీ పెట్టించి, ఆ స్కాలర్‌షిప్స్, కాంటిన్‌జెన్సీ ఫండ్స్ సంగతి పేపర్ కివ్వకుంటే నేను చెలాన్నే కాదు.''

''ఓ తాకిడి తగలాల్సిందే గురూ...''

''నువ్వు నిలబడు. నీ అడుగుల్లో మేముంటాం.''

''వార్మీ ఫూల్...''

''నంబర్ వన్ రోగ్ ''

''అడిగో,వస్తున్నాడ్రోయ్...పేడ మొహంవాడూ...ఆహా... ఏవా–నడక, మధురవాణితో దెబ్బలు తిని కాలొంకరపోయిన కరకట శాస్త్రుల్లా...''—సుబ్బారావు.

మిగతా వారంతా చూసేరు. సుబ్బారావు జోక్ ఎవరిమీదా పనిచెయ్యలేదు. ఎవరూ నోరిప్పలేదు.

దుర్మార్గంనుంచి, దూరంగా జరిగే బుద్ధిమంతుల్లా ఒక్కొక్కరే, స్టాఫ్ రూంలోంచి వరండాలోకి వచ్చేరు.

హెడ్‌మాస్టర్ని చూస్తూనే కేశావు, ''సోత్తరవయ్యా...'' అని ప్రక్కగా నిలుచున్నాడు. విద్యార్థులు కొందరు కావాలని ఎదురై నమస్కరించేరు. కొందరు చూసీ, చూడనట్టు నటించేరు. ఓదేలు ఎదురేగి, దండం పెడుతూ బేగ్ అందుకొన్నాడు.

టీచర్స్–అడ్డు పడి, 'గుడ్‌మోనింగ్' చెపుతూ పెదాలపై చిరునవ్వాడించేరు.

రిసీవ్ చేసుకొంటూ బదులు నవ్వు నవ్వేడు హెడ్మాష్టర్.

సంతకం పెట్టేందుకు హెడ్మాష్టర్ని వెన్నంటిన టీచర్స్, సంతకం పెట్టినా ఆ గది వదల్లేదు. హెడ్మాష్టరేదైనా ఆజ్ఞ జారీ చేస్తే తలూపడానికి సిద్ధంగా నిలుచున్నారు.

గాలిలేక పేపర్‌తో విసురుకొనే హెడ్‌మాస్టర్ బాధ చూళ్లేనట్టుగా, ''వర్షాకాలమైనా ఎండాకాలాన్ని మరిపిస్తుంది సార్. ఫేన్ వేసేదా?'' అంటూ గోడకున్న స్విచ్‌నొక్కేడు చెలం!